रजिस्ट्री सं. डी-२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య. డి-221

मूल्य रू. १०-००
Price Rs.10-00
మూల్యము : రూ. 10-00

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ
भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1
प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं २. | नई दिल्ली | बुधवार | ९ सेप्टंबर, २०२० | भाद्रपद | खंण्ड २८ |
| No.2 | New Delhi | Wednesday | 9 September, 2020 | Bhadrapada | Vol. 28 |
| సంఖ్య 2 | న్యూఢిల్లీ | బుధవారము | 9 సెప్టెంబర్, 2020 | భాద్రపద | సంపుటము 28 |

## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 6th August, 2020

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Suits Valuation Act, 1887 [Act No.7 of 1887], (2) The Provisional Collection of Taxes Act, 1931 [Act No.16 of 1931], (3) The Central Boards of Revenue Act, 1963 [Act No.54 of 1963], (4) The Infant Milk Substitutes, Feeding Bottles and Infant Foods (Regulation of Production, Supply and Distribution) Act, 1992 [Act No.41 of 1992], (5) The Right of Children to Free and Compulsory Education Act, 2009 [Act No.35 of 2009] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) దావాల మదింపు చట్టము, 1887 (1887లోని 7వ చట్టము), (2) పన్నుల తాత్కాలిక వసూలు చట్టము, 1931 (1931లోని 16వ చట్టము), (3) కేంద్ర రెవెన్యూ బోర్డుల చట్టము, 1963 (1963లోని 54వ చట్టము), (4) పసిపిల్లల పాల ప్రత్యామ్నాయములు, పాల సీసాలు మరియు పసిపిల్లల ఆహారముల (ఉత్పత్తి, సరఫరా మరియు పంపిణీల క్రమబద్ధీకరణ) చట్టము, 1992 (1992లోని 41వ చట్టము), (5) ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కు చట్టము, 2009 (2009లోని 35వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కు చట్టము, 2009

(2009లోని 35వ చట్టము)

[26, ఆగస్టు 2009]

*ఆరు నుండి పదునాలుగు సంవత్సరముల మధ్య వయస్సు గల బాలలందరకు ఉచిత మరియు నిర్బంధ విద్యనందించుటకైన చట్టము.*

భారత గణరాజ్యము యొక్క అరువదియవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - I

### ప్రారంభిక

1. (1) ఈ చట్టమును ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కు చట్టము, 2009 అని పేర్కొనవచ్చును.

(2) ఇది [2] * * * యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన[3] అమలులోనికి వచ్చును.

[4][(4) సంవిధానము యొక్క 29 మరియు 30వ అనుచ్ఛేదములోని నిబంధనలకు అధ్యధీనమై, ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలలపై హక్కులను ఒసగుటకు ఈ చట్టము యొక్క నిబంధనలు వర్తింపజేయవలెను.

(5) ఈ చట్టములో నున్నదేదియూ, మదర్సాలకు, వేద పాఠశాలలకు మరియు మతబోధన అందించు ప్రాథమిక విద్యా సంస్థలకు వర్తించదు.]

2. ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,-

(ఎ) "సముచిత ప్రభుత్వము" అనగా,-

---

1. రద్దు మరియు సవరణ చట్టము, 2017 (2018లోని 2వది) అనుసూచి-II చే, పరిచ్ఛేదము 1 ఉపాంత శీర్షికలో బదులుగా ఉంచబడినది.
2. "జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యము మినహా" అను పదబంధములు 2019లోని 34వ చట్టము, పరిచ్ఛేదము 95 మరియు 5వ అనుసూచి ద్వారా లుప్తము చేయబడినది (31-10-2019 నుండి).
3. 2010 ఫిబ్రవరి 16వ తేదీగల అధిసూచన నెం.ఎస్.ఒ.428 (ఈ) ద్వారా 2010, ఏప్రిల్ 1 మొదటి తేది భారత రాజపత్రము, అసాధారణ భాగము-II, పరిచ్ఛేదము 3(ii) చూడుము.
4. 2012లోని 30వ చట్టపు 2వ పరిచ్ఛేదము ద్వారా (1-8-2012 నుండి) చొప్పించబడినది.

(i) కేంద్ర ప్రభుత్వము లేక శాసనమండలి లేనటువంటి సంఘ రాజ్యక్షేత్రము యొక్క పాలకునిచే స్థాపించబడి, స్వామ్యము కలిగిన లేక నియంత్రించబడుతున్న ఒక పాఠశాలకు సంబంధించి కేంద్రప్రభుత్వము;

(ii) ఉప-ఖండము (i)లో నిర్దేశింపబడినట్లుగా కాకుండా, ఈ క్రింది రాజ్య క్షేత్రములో స్థాపించబడిన పాఠశాలకు సంబంధించి-

(ఏ) ఒక రాజ్యములో, ఆ రాజ్య ప్రభుత్వము;

(బీ) శాసనమండలి ఉన్నట్టి ఒక సంఘ రాజ్య క్షేత్రములో, ఆ సంఘ రాజ్య క్షేత్ర ప్రభుత్వము;

- అని అర్థము;

(బి) "క్యాపిటేషను ఫీజు" అనగా పాఠశాలచే అధిసూచింపబడిన ఫీజుకానట్టి ఏదేని రూపములోని విరాళము లేక అంశదాయము లేక చెల్లింపు అని అర్థము;

(సి) "బాలుడు" అనగా ఆరు నుండి పదునాలుగు సంవత్సరముల మధ్య వయస్సు గల మగపిల్లవాడు లేక ఆడపిల్ల అని అర్థము;

(డి) "అననుకూల వర్గమునకు చెందిన బాలుడు" అనగా [1][అంగవైకల్యంగల బాలుడు/బాలిక లేక] సముచిత ప్రభుత్వముచే అధిసూచన ద్వారా అధిసూచించబడునట్లుగా, అనుసూచిత కులము, అనుసూచిత జనజాతి, సామాజికముగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతికి లేక సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భౌగోళిక, భాషావిషయక, లింగబేధ లేక అట్టి ఇతర అంశాలకు సంబంధించిన అననుకూలత కలిగినట్టి ఇతర వర్గమునకు చెందిన బాలుడు/బాలిక అని అర్థము;

(ఇ) "బలహీన వర్గమునకు చెందిన బాలుడు" అనగా సముచిత ప్రభుత్వముచే అధిసూచన ద్వారా నిర్దిష్టపరచబడిన కనీస పరిమితి కంటె తక్కువ వార్షికాదాయము కలిగినట్టి తల్లిదండ్రుల లేక సంరక్షునికి చెందిన బాలుడు అని అర్థము;

[2][(ఇఇ) "అంగవైకల్యం గల బాలుడు/బాలిక" అను పదములో,-

---

1. 2012లోని 30వ చట్టము, 2వ పరిచ్ఛేదము ద్వారా (1-8-2012 నుండి) చొప్పించబడినది.

2. అదే చట్టము 3వ పరిచ్ఛేదము ద్వారా (1-8-2012 నుండి) చొప్పించబడినది.

(ఏ) అంగవైకల్యం కలిగిన వ్యక్తుల (సమాన అవకాశములు, హక్కుల పరిరక్షణ మరియు సంపూర్ణ భాగస్వామ్య) చట్టము, 1995 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (ఐ)లో నిర్వచించబడినట్లుగా "అంగవైకల్యం" గల బాలుడు/బాలిక; 1996లోని 1వది.

(బీ) ఆటిసమ్, సెరిబ్రల్ పాల్సీ, బుద్ధిమాంద్యత మరియు బహు విధముల వికలాంగత కలిగిన వ్యక్తుల సంక్షేమమునకైన జాతీయ ట్రస్టు చట్టము, 1999 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (జె)లో నిర్వచించబడినట్లుగా అంగవైకల్యం కలిగిన వ్యక్తి అయినట్టి ఒక బాలుడు/బాలిక; 1999లోని 44వది.

(సీ) ఆటిసమ్, సెరిబ్రల్ పాల్సీ, బుద్ధిమాంద్యత మరియు బహు విధముల వికలాంగత కలిగిన వ్యక్తుల సంక్షేమమునకైన జాతీయ ట్రస్టు చట్టము, 1999 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (ఒ)లో నిర్వచించబడినట్లుగా "తీవ్రమైన అంగవైకల్యం కలిగిన" ఒక బాలుడు/బాలిక; 1999లోని 44వది.

చేరియుండును.]

(ఎఫ్) "ప్రాథమిక విద్య" అనగా ఒకటవ తరగతి నుండి ఎనిమిదవ తరగతుల మధ్యగల విద్య అని అర్థము;

(జి) బాలునికి సంబంధించి "సంరక్షకుడు" అనగా ఆ బాలుని సంరక్షణ మరియు అభిరక్షణ కలిగియున్న ఒక వ్యక్తి అని అర్థము మరియు ఇందులో సహజసిద్ధ సంరక్షుకుడు లేక న్యాయస్థానము ద్వారా నియతము చేయబడిన లేక శాసనము ద్వారా ప్రఖ్యానింపబడిన సంరక్షకుడు చేరియుందురు;

(హెచ్) "స్థానిక ప్రాధికారము" అనగా అది ఏ పేరుతో పిలువబడినప్పటికీ, పురపాలక కార్పొరేషను లేక పురపాలక కౌన్సిలు లేక జిల్లా పరిషత్తు లేక నగర పంచాయతీ లేక పంచాయతీ అని అర్థము మరియు ఇందులో తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము క్రింద ఏదేని నగరము, పట్టణము లేక గ్రామములో స్థానిక ప్రాధికారము యొక్క కృత్యములను నిర్వహించుటకు ప్రాధికారమొసగబడిన లేక పాఠశాలలపై పరిపాలనా నియంత్రణ కలిగినట్టి ఇతర ప్రాధికారము లేక నికాయము చేరియుండును;

2006లోని 4వది.

(ఐ) "బాలల హక్కుల రక్షణ కొరకైన జాతీయ కమీషను" అనగా బాలల హక్కుల రక్షణ కమీషనుల చట్టము, 2005 యొక్క 3వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేయబడిన బాలల హక్కులను రక్షించుటకైన జాతీయ కమీషను అని అర్థము;

(జె) "అధిసూచన" అనగా అధికారికరాజపత్రములో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము;

(కె) "తల్లిదండ్రులు" అనగా సహజసిద్ధంగా లేక సవతి లేక దత్తత పొందిన బాలుని యొక్క తండ్రి లేక తల్లి అని అర్థము;

(ఎల్) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఎమ్) "అనుసూచి" అనగా ఈ చట్టమునకు అనుబంధించబడిన అనుసూచి అని అర్థము;

(ఎన్) "పాఠశాల" అనగా ప్రాథమిక విద్యనందించు గుర్తింపు పొందిన ఏదేని పాఠశాల అని అర్థము, మరియు ఇందులో,-

(i) సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారముచే స్థాపించబడి, స్వామ్యము లేక నియంత్రణ కలిగిన పాఠశాల;

(ii) సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారము నుండి ఖర్చులను పూర్తిగాను లేక భాగతః భరించుటకు సహాయము లేక అనుదానము పొందు ఎయిడెడ్ పాఠశాల;

(iii) నిర్దిష్టపరచబడిన శ్రేణికి చెందిన పాఠశాల; మరియు

(iv) సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారము నుండి ఖర్చులను భరించుటకు ఏ రూపంలోను సహాయము లేక అనుదానము పొందనటువంటి అన్ ఎయిడెడ్ పాఠశాల,

- చేరియుండును.

(ఒ) "స్క్రీనింగ్ ప్రక్రియ" అనగా యాదృచ్ఛిక పద్ధతిలో కాకుండా ఇంకొకరిపై ప్రాధాన్యతగా ఒక బాలుని ప్రవేశమునకు ఎంపిక చేయు పద్ధతి అని అర్థము;

(పి) ఒక పాఠశాలకు సంబంధించి "నిర్దిష్టపరచబడిన శ్రేణి" అనగా కేంద్రీయ విద్యాలయము, నవోదయ విద్యాలయము, సైనిక

పాఠశాల లేక సముచిత ప్రభుత్వముచే అధిసూచన ద్వారా విశిష్టమైన లక్షణం కలిగినదిగా నిర్దిష్టపరచబడినట్టి ఏదేని ఇతర పాఠశాల అని అర్థము;

(క్యు) "బాలల హక్కుల రక్షణకొరకైన రాజ్య కమీషను" అనగా బాలల హక్కుల రక్షణ కమీషను చట్టము, 2005 యొక్క 3వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేయబడిన రాజ్య కమీషను అని అర్థము; 2006లోని 4వది.

## అధ్యాయము - II

### ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు.

ఉచిత మరియు నిర్బంధ విద్యకై బాలుని హక్కు.

3. [1][(1) 2వ పరిచ్ఛేదపు ఖండము (డి) లేక ఖండము (ఇ)లో పేర్కొనబడిన ఒక బాలుడు/బాలికతోసహా ఆరు నుండి పదునాలుగు సంవత్సరముల మధ్య వయస్సు గల ప్రతియొక్క బాలునికి/బాలికకు దగ్గరలో ఉన్న పాఠశాలలో అతడు లేక ఆమె ప్రాథమిక విద్య పూర్తియగునంత వరకు ఉచిత మరియు నిర్బంధ విద్యను పొందు హక్కు కలిగియుండును.]

(2) ఉప-పరిచ్ఛేదము (1) నిమిత్తము, ప్రాథమిక విద్యను పొందుట లేక పూర్తి చేయుట నుండి ఏ విధముగానైనను నివారించు ఏదేని రూపములోని ఫీజు లేక ఛార్జీలు లేక వ్యయముల చెల్లింపుకు బాలునికి/బాలికకు బాధ్యత ఉండదు.

[2]* * * *

[3][(3) అంగవైకల్యం కలిగిన వ్యక్తుల (సమాన అవకాశములు, హక్కుల పరిరక్షణ మరియు సంపూర్ణ భాగస్వామ్యం) చట్టము, 1995 యొక్క నిబంధనలకు భంగము కలుగకుండా, 2వ పరిచ్ఛేదపు ఖండము (ఇఇ)లోని ఉప-ఖండము (ఏ)లో పేర్కొనబడిన ఒక బాలుడు/బాలిక, మరియు 2వ పరిచ్ఛేదపు ఖండము (ఇఇ)లోని ఉప-ఖండములు (బీ) మరియు (సీ)లలో పేర్కొనబడిన ఒక బాలుడు/బాలిక ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను పొందుటలో అంగవైకల్యం కలిగిన వ్యక్తుల (సమాన అవకాశములు, హక్కుల పరిరక్షణ మరియు సంపూర్ణ భాగస్వామ్యము) చట్టము, 1995 యొక్క అధ్యాయము-Vలోని నిబంధనల క్రింద అంగవైకల్యములతోనున్న బాలలు కలిగియుండు అవే హక్కులను కలిగియుందురు: 1996లోని 1వది.

అయితే, ఆటిసమ్, సెరిబ్రల్ పాల్సీ, బుద్ధిమాంద్యత మరియు బహు వికలాంగత కలిగిన వ్యక్తుల సంక్షేమమునకైన జాతీయ ట్రస్టు చట్టము, 1999 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండము (హెచ్)లో పేర్కొన్న "బహు వికలాంగతతో" నున్న బాలుడు/బాలిక మరియు ఖండము (ఒ)లో పేర్కొనబడిన "తీవ్రమైన అంగవైకల్యం" కలిగిఉన్న బాలుడు/బాలిక గృహప్రాతిపదికపై విద్యను ఎంపిక చేసుకొను హక్కును కూడా కలిగియుందురు.]

1999లోని 44వది.

ప్రాధమిక విద్యలో ప్రవేశించని లేక పూర్తి చేయని బాలలకు ప్రత్యేక నిబంధనలు.

4. ఆరు సంవత్సరముల వయస్సుకు మించిన బాలుడు/బాలిక ఏదేని పాఠశాలలో ప్రవేశించకపోయినను లేక ప్రవేశించినను అతను లేక ఆమె ప్రాధమిక విద్యను పూర్తి చేయలేకపోయినయెడల, అపుడు, అతనిని లేక ఆమెను, అతని లేక ఆమె వయస్సుకు సముచితమైన తరగతిలో ప్రవేశింపజేయవలెను:

అయితే, ఆ బాలుని/బాలికను అతని లేక ఆమె వయస్సుకు సముచితమైన తరగతిలో నేరుగా ప్రవేశింపజేసినప్పుడు, ఇతరులతో సమానముగా ఉండుటకై విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి పరిమిత సమయములలో ప్రత్యేక శిక్షణను పొందుటకు అతడు లేక ఆమె హక్కు కలిగియుండును:

అయితే ఇంకనూ, అట్లు ప్రాధమిక విద్యలో ప్రవేశింపజేసిన బాలుడు/బాలిక పదునాలుగు సంవత్సరముల వయస్సు తరువాత కూడ ఉచిత ప్రాధమిక విద్యను పూర్తిచేయునంతవరకు అర్హత కలిగియుండును.

ఇతర పాఠశాలకు బదిలీ హక్కు.

5. (1) ఒక పాఠశాలలో ప్రాధమిక విద్య పూర్తిచేయు సదుపాయములేనప్పుడు, బాలుడు/బాలిక ప్రాధమిక విద్యను పూర్తిచేయుటకై 2వపరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండములు (iii) మరియు (iv)లో నిర్దిష్టపరచబడిన పాఠశాలను మినహాయించి, ఏదేని ఇతర పాఠశాలకు బదిలీని కోరు హక్కు అతనికి లేక ఆమెకు ఉండును.

(2) ఏ కారణముపైనైనను, ఒక రాజ్యములోపల లేక దానికి వెలుపల ఒక పాఠశాల నుండి వేరొక పాఠశాలకు బాలుడు/బాలిక మారవలసిన అవసరమున్నప్పుడు, అట్టి బాలుడు/బాలిక అతని లేక ఆమె ప్రాధమిక విద్యను పూర్తిచేయుటకు 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండములు (iii) మరియు (iv)లో నిర్దిష్టపరచబడిన పాఠశాలను మినహాయించి, ఏదేని ఇతర పాఠశాలకు బదిలీ కోరు హక్కు కలిగియుండును.

(3) అట్టి ఇతర పాఠశాలలో ప్రవేశించుటకై అట్టి బాలుడు/బాలిక చివరగా చేరిన పాఠశాల యొక్క ప్రధాన అధ్యాపకుడు లేక ఇంఛార్జీ వెంటనే బదిలీ ధృవపత్రము జారీచేయవలెను:

అయితే, బదిలీ ధృవపత్రము సమర్పించుటలోని ఆలస్యము, అట్టి ఇతర పాఠశాలనందు ప్రవేశమును ఆలస్యము చేయుటకు లేక నిరాకరించబడుటకు కారణము కారాదు:

అయితే ఇంకనూ, బదిలీ ధృవపత్రమును జారీచేయుటలో పాఠశాల యొక్క ప్రధాన అధ్యాపకుడు లేక ఇంఛార్జీ చేసిన ఆలస్యమునకు అతనికి లేక ఆమెకు వర్తించు సేవా నియమముల క్రింద క్రమశిక్షణా చర్యకు బాధ్యులగుదురు.

## అధ్యాయము - III

## సముచిత ప్రభుత్వము, స్థానిక ప్రాధికారము మరియు తల్లిదండ్రుల కర్తవ్యములు.

6. ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచుటకు, సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికారము, ఈ చట్టము ప్రారంభమైనప్పటి నుండి మూడు సంవత్సరముల కాలావధిలోపుగా విహితపరచబడినట్టి ప్రాంతము లేక దగ్గరగా ఉన్న పరిధులలో పాఠశాల స్థాపించబడని ప్రాంతములో పాఠశాలను స్థాపించవలెను.

పాఠశాలను స్థాపించుట సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికారము యొక్క కర్తవ్యము.

7. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకై నిధులను ఏర్పాటుచేయుటకు కేంద్ర ప్రభుత్వము మరియు రాజ్య ప్రభుత్వములకు ఉభయ బాధ్యతలు ఉండును.

విత్తీయ మరియు ఇతర బాధ్యతలను పంచుకొనుట.

(2) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటకై కేంద్ర ప్రభుత్వము మూలధనము మరియు ఆవృత్తక వ్యయముల అంచనాలను తయారుచేయవలెను.

(3) కేంద్ర ప్రభుత్వము ఆయా సమయములందు రాజ్య ప్రభుత్వములతో సంప్రదించిన మీదట, ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దేశింపబడిన వ్యయములో తాను సబబని భావించునట్టి శాతమును రెవిన్యూ సహాయక అనుదానములుగా రాజ్య ప్రభుత్వములకు ఏర్పాటు చేయవలెను.

(4) కేంద్ర ప్రభుత్వము ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచుటకై, ఏదేని రాజ్య ప్రభుత్వము తమ వాటా నిధులను అందించుటకు వీలుగా, సదరు రాజ్య ప్రభుత్వమునకు అదనపు వనరులను సమకూర్చవలసిన అవసరమును పరిశీలించుటకై 280వ అనుచ్ఛేదపు ఖండము (3) యొక్క ఉప-ఖండము (డి) క్రింద విత్తీయ కమీషనుకు నిర్దేశము చేయవలసినదిగా రాష్ట్రపతిని కోరవచ్చును.

(5) ఉప-పరిచ్ఛేదము (4)లో, ఏమి ఉన్నప్పటికినీ, రాజ్యప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (3) క్రింద కేంద్రప్రభుత్వముచే రాజ్య ప్రభుత్వమునకు నిబంధించబడు మొత్తములను, మరియు దాని ఇతర వనరులను దృష్టియందుంచుకొని, ఈ చట్టపు నిబంధనలను అమలు పరచుటకై నిధులను ఏర్పాటుచేయుటకు బాధ్యత వహించవలెను.

(6) కేంద్ర ప్రభుత్వము-

(ఎ) 29వ పరిచ్ఛేదము క్రింద నిర్దిష్టపరచబడిన విద్యావిషయక ప్రాధికారము యొక్క సహాయముతో జాతీయ పాఠ్యప్రణాళికలో ఒక కార్యాచరణను అభివృద్ధి పరచవలెను;

(బి) ఉపాధ్యాయుల శిక్షణకు ప్రమాణములను అభివృద్ధిపరిచి అమలుపరచవలెను;

(సి) క్రొత్త పద్ధతులు, పరిశోధనలు, ప్రణాళిక మరియు సమర్థతను పెంపొందించుటకు, రాజ్య ప్రభుత్వమునకు సాంకేతిక మద్దతును మరియు వనరులను సమకూర్చవలెను.

సముచిత ప్రభుత్వము యొక్క కర్తవ్యములు.

8. సముచిత ప్రభుత్వము,-

(ఎ) ప్రతియొక్క బాలునికి/బాలికకు ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించవలెను:

అయితే, ఒక బాలుడు/బాలిక అతని లేక ఆమె తల్లిదండ్రులచే లేక సందర్భానుసారము సంరక్షకునిచే, సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారము స్థాపించబడి, స్వామ్యము కలిగి నియంత్రణ కలిగిన లేక ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దాని నుండి తగినంత నిధులను ఆర్థిక సహాయంగా పొందుచున్న పాఠశాల కానట్టి ఇతర పాఠశాలలో చేర్పించబడినపుడు, అట్టి బాలుడు/బాలిక లేదా అతని లేక ఆమె తల్లిదండ్రులు లేక సందర్భానుసారము సంరక్షకుడు అట్టి ఇతర పాఠశాలలో ఆ బాలుని/ఆ బాలిక ప్రాథమిక విద్యపై ఖర్చుచేసిన వ్యయమును తిరిగి రాబట్టుకొనుటకు అర్హులైయుండరు.

<u>విశదీకరణ</u>:- "నిర్బంధ విద్య" అనగా సముచిత ప్రభుత్వమునకు ఈ క్రింది విషయములలో, అవేవనగా:-

(i) ఆరు నుండి పదునాలుగు సంవత్సరముల మధ్య వయస్సు గల ప్రతియొక్క బాలునికి/బాలికకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించుట; మరియు

(ii) ఆరు నుండి పదునాలుగు సంవత్సరముల మధ్య వయస్సుగల ప్రతి యొక్క బాలుని/బాలికచే నిర్బంధ ప్రవేశము, హాజరు మరియు వారు ప్రాథమిక విద్యను పూర్తి చేయునట్లు చూచుట;

(బి) 6వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచబడిన విధంగా దగ్గరలో పాఠశాల ఉండునట్లు చూచుట;

(సి) బలహీన వర్గమునకు చెందిన బాలుడు/బాలికకు మరియు అననుకూల వర్గమునకు చెందిన బాలుడు/బాలికకు ఏ కారణములపైనైనను ప్రాథమిక విద్యను పొందుట నుండి మరియు పూర్తి చేయుట నుండి వివక్షత చూపరాదు మరియు నిరోధించరాదు;

(డి) పాఠశాల భవనము, బోధనా సిబ్బంది మరియు విద్యాసముపార్జనకైన సాధన సామాగ్రితో సహా మౌలిక సదుపాయములను కల్పించుట;

(ఇ) 4వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచబడిన విధంగా ప్రత్యేక శిక్షణా సదుపాయమును కల్పించుట;

(ఎఫ్) ప్రతియొక్క బాలుని/బాలిక ప్రవేశము, హాజరును పర్యవేక్షించుట మరియు అతనిచే ప్రాథమిక విద్య పూర్తిచేయబడునట్లు చూచుట;

(జి) అనుసూచిలో నిర్దిష్టపరచబడిన ప్రమాణములకు మరియు సూత్రములకు అనుగుణముగా ప్రాథమిక విద్యలో మంచి నాణ్యత ఉండునట్లు చూచుట;

(హెచ్) ప్రాథమిక్క విద్యకైన పాఠ్యప్రణాళిక మరియు అధ్యయన కోర్సులను సకాలంలో విహితపరచబడునట్లు చూచుట;

(ఐ) అధ్యాపకులకు శిక్షణా సదుపాయములను ఏర్పాటు చేయు బాధ్యత కలిగి ఉండును.

9. ప్రతి యొక్క స్థానిక ప్రాధికారము,- స్థానిక ప్రాధికారము యొక్క కర్తవ్యములు.

(ఎ) ప్రతియొక్క బాలునికి/బాలికకు ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించవలెను:

అయితే, ఒక బాలుడు/బాలిక అతని లేక ఆమె తల్లిదండ్రులచే లేక సందర్భానుసారము సంరక్షకునిచే, సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారము స్థాపించబడి, స్వామ్యము, నియంత్రణ కలిగిన లేక ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దాని నుండి

తగినన్ని నిధులను ఆర్థిక సహాయంగా పొందుచున్న పాఠశాల కానట్టి ఇతర పాఠశాలలో చేర్పించబడినపుడు, అట్టి బాలుడు/బాలిక లేదా అతని లేక ఆమె తల్లిదండ్రులు లేక సందర్భానుసారము సంరక్షకుడు అట్టి పాఠశాలలో బాలుని/బాలిక ప్రాథమిక విద్యపై ఖర్చుచేసిన వ్యయమును తిరిగి రాబట్టుకొనుటకు అర్హులైయుండరు.

(బి) 6వ పరిచ్ఛేదములో నిర్ధిష్టపరచబడిన విధంగా దగ్గరలో పాఠశాల ఉండునట్లు చూడవలెను;

(సి) బలహీన వర్గమునకు చెందిన బాలుడు/బాలికకు మరియు అననుకూల వర్గమునకు చెందిన బాలుడు/బాలికకు ఏ కారణములపైనైనను ప్రాధమిక విద్యను పొందుట మరియు పూర్తి చేయుట నుండి వివక్షత చూపరాదు మరియు నివారించరాదు;

(డి) దాని అధికారితా పరిధిలో నివసించుచున్న పదునాలుగు సంవత్సరముల వయస్సు వరకు గల బాలల రికార్డులను విహితపరచబడినట్టి రీతిలో నిర్వహించవలెను;

(ఇ) దాని అధికారితా పరిధిలో నివసించుచున్న ప్రతియొక్క బాలుని/బాలిక ప్రవేశము, హాజరును పర్యవేక్షించవలెను మరియు వారిచే ప్రాధమిక విద్య పూర్తి చేయబడునట్లు చూడవలెను;

(ఎఫ్) పాఠశాల భవనము, బోధనా సిబ్బంది మరియు విద్యాసముపార్జనకైన సామగ్రితో సహా మౌలిక సదుపాయములను కల్పించవలెను;

(జి) 4వ పరిచ్ఛేదములో నిర్ధిష్టపరచబడిన విధంగా ప్రత్యేక శిక్షణా సదుపాయమును కల్పించవలెను;

(హెచ్) అనుసూచిలో నిర్ధిష్టపరచబడిన ప్రమాణములకు మరియు సూత్రములకు అనుగుణముగా ప్రాధమిక విద్యలో మంచి నాణ్యత ఉండునట్లు చూడవలెను;

(ఐ) ప్రాధమిక విద్యకైన పాఠ్యప్రణాళిక మరియు అధ్యయన కోర్సులను సకాలంలో విహితపరచబడునట్లు చూడవలెను;

(జె) అధ్యాపకులకు శిక్షణా సదుపాయములను ఏర్పాటు చేయవలెను;

(కె) వలసపోవు కుటుంబాలలోని పిల్లలు ప్రవేశము పొందునట్లు చూడవలెను;

(ఎల్) దాని అధికారితా పరిధిలోని పాఠశాలల విధి నిర్వహణను పర్యవేక్షించవలెను; మరియు

(ఎమ్) విద్యా సంవత్సర క్యాలెండరును నిర్ణయించవలెను.

10. దగ్గరగా ఉన్న పాఠశాలలోని ప్రాథమిక విద్యలో అతని లేక ఆమె పిల్లవానిని లేక సందర్భానుసారము సంరక్షణలోని బాలుడిని చేర్పించుట లేక చేర్పించబడునట్లు చూచుట ప్రతి తల్లిదండ్రులు లేక సంరక్షకుని కర్తవ్యమై ఉండును. తల్లి దండ్రుల మరియు సంరక్షకుని కర్తవ్యము.

11. మూడు సంవత్సరముల కంటే ఎక్కువ వయస్సుగల పిల్లలను ప్రాథమిక విద్యకై సంసిద్ధులుగా చేయుటకు మరియు ప్రారంభ బాల్య సంరక్షణకు మరియు వారు ఆరు సంవత్సరముల వయస్సు పూర్తిచేయునంత వరకు పిల్లలందరికి విద్యను అందించుటకు, అట్టి పిల్లలందరికీ ఉచిత పూర్వ పాఠశాల విద్యను కల్పించుటకు సముచిత ప్రభుత్వము అవసరమైన ఏర్పాట్లు చేయవచ్చును. సముచిత ప్రభుత్వము పూర్వ పాఠశాల విద్యను ఏర్పాటుచేయుట.

## అధ్యాయము - IV

## పాఠశాలల మరియు అధ్యాపకుల బాధ్యతలు

12. (1) ఈ చట్టపు ప్రయోజనముల కొరకు, - ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకు పాఠశాలల బాధ్యత యొక్క విస్తరణ.

(ఎ) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండము (i)లో నిర్దిష్టపరచ బడిన పాఠశాల, అందులో చేర్పించుకొనబడిన బాలలందరికి ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించవలెను;

(బి) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండము (ii)లో నిర్దిష్టపరచ బడిన పాఠశాల, దాని వార్షిక ఆవృత్తక సహాయము లేక అట్లు స్వీకరించిన అనుదానములు దాని వార్షిక ఆవృత్తక వ్యయములకు సరిపోయినందున, దానిలో చేర్చుకొనబడిన బాలలలో కనీసము ఇరువది ఐదు శాతమునకు అధ్యధీనమైనట్టి అనుపాతములో ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించవలెను;

(సి) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండములు (iii) మరియు (iv)లలో నిర్దిష్టపరచబడిన పాఠశాల, 1వ తరగతిలో, ఆ తరగతిలోని మొత్తము సంఖ్యలో కనీసము ఇరువది ఐదు శాతము వరకు బలహీన వర్గము లేక

అననుకూల వర్గమునకు దగ్గరగానున్న వర్గమునకు చెందిన బాలలను చేర్చుకొని ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను పూర్తియగునంత వరకు అందించవలెను:

అయితే, 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్)లో నిర్ధిష్టపరచబడిన పాఠశాల, పూర్వ పాఠశాల విద్యను బోధించునపుడు, ఖండములు (ఎ) నుండి (సి)లలోని నిబంధనలు అట్టి పూర్వ పాఠశాల విద్య యొక్క ప్రవేశమునకు వర్తించును.

(2) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప-ఖండము (iv)లో నిర్ధిష్టపరచబడి, ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (సి)లో నిర్ధిష్టపరచబడిన విధముగా ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించుచున్న పాఠశాల ఆవిధంగా అది ఖర్చుచేసిన వ్యయమును, బాలుని ఒక్కంటికి రాష్ట్ర ప్రభుత్వముచే ఖర్చు చేయబడిన వ్యయము లేక బాలుని వద్ద నుండి వసూలు చేసిన వాస్తవ మొత్తము, ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తమును విహిత పరచబడిన రీతిలో తిరిగి రాబట్టుకొనవలెను:

అయితే, అట్టి తిరిగి రాబట్టుకొనుట 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప- ఖండము (i)లో నిర్ధిష్టపరచబడిన పాఠశాలచే బాలుని ఒక్కంటికి ఖర్చు చేయబడిన వ్యయమునకు మించరాదు:

అంతేకాక, ఏదేని భూమి, భవనము, సాధన సామాగ్రి లేక ఇతర సదుపాయములను మూల్యరహితము లేక తగ్గింపు రేటుకు పొందినందుకుగాను నిర్ధిష్టపరచబడిన సంఖ్యలో బాలలకు ఉచిత విద్యను అందించవలసిన బాధ్యతను కలిగి ఉన్నట్టి పాఠశాలకు అట్టి బాధ్యత మేరకు తిరిగి రాబట్టుకొనుటకు అర్హత ఉండదు.

(3) ప్రతి పాఠశాల, సముచిత ప్రభుత్వము లేక సందర్భానుసారముగా స్థానిక ప్రాధికారము కోరినట్టి సమాచారమును ఈయవలెను.

ప్రవేశమునకు క్యాపిటేషన్ ఫీజు మరియు స్క్రీనింగ్ ప్రక్రియ ఉండరాదు.

13. (1) పాఠశాలలో ఒక బాలునికి ప్రవేశము కల్పించునపుడు పాఠశాల లేక వ్యక్తి ఎటువంటి ప్రవేశ క్యాపిటేషన్ ఫీజును వసూలు చేయరాదు మరియు బాలుని/బాలికను లేక అతడి లేక ఆమె తల్లిదండ్రులను లేక సంరక్షకుడిని ఎటువంటి స్క్రీనింగ్ ప్రక్రియకు గురిచేయరాదు.

(2) ఏదేని పాఠశాల లేక వ్యక్తి ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలను ఉల్లంఘించి,-

(ఎ) క్యాపిటేషన్ ఫీజును వసూలుచేసిన యెడల, వసూలు చేసిన క్యాపిటేషన్ ఫీజుకు పదిరెట్ల వరకు విస్తరించగల జరిమానాతో శిక్షింపబడదగి యుండును;

(బి) బాలుని/బాలికను స్క్రీనింగ్ ప్రక్రియకు గురిచేసినపుడు, మొదటి ఉల్లంఘనకు ఇరువది ఐదు వేల రూపాయల వరకు మరియు తదుపరి ప్రతి ఉల్లంఘనకు యాబది వేల రూపాయల వరకు విస్తరించగల జరిమానాతో శిక్షింపబడదగి యుండును.

14. (1) ప్రాథమిక విద్యలో ప్రవేశమునకుగాను జనన, మరణ మరియు వివాహముల రిజిస్ట్రేషను చట్టము, 1886 యొక్క నిబంధనలను అనుసరించి జారీచేయబడిన జనన ధృవ పత్రము యొక్క ప్రాతిపదికపై లేక విహితపరచబడునట్టి ఇతర దస్తావేజుపై బాలుని లేక బాలిక వయస్సును నిర్ధారించవలెను. ప్రవేశమునకు వయస్సును ఋజువు చేయుట. 1886లో 6వది.

(2) వయస్సు ఋజువుపరచనందున పాఠశాలలో బాలుని లేక బాలిక ప్రవేశమును నిరాకరించరాదు.

15. విద్యా సంవత్సర ప్రారంభమున లేక విహితపరచబడునట్టి పొడిగింపబడిన కాలావధిలోపుగా ఒక బాలుని లేక బాలికను పాఠశాలలో చేర్చుకొనవలెను: ప్రవేశమును నిరాకరించరాదు.

అయితే, పొడిగింపబడిన కాలావధి తరువాత అట్టి ప్రవేశమును కోరిన యెడల బాలుని లేక బాలిక ప్రవేశమును నిరాకరించరాదు:

అంతేకాక, పొడిగింపబడిన కాలావధి తరువాత చేర్చుకొనబడిన ఎవరేని బాలుడు, సముచిత ప్రభుత్వముచే విహితపరచబడునట్టి రీతిలో అతని అధ్యయనమును పూర్తిచేయవలెను.

'16. (1) ప్రతి విద్యా సంవత్సరము ఆఖరున ఐదవ తరగతి మరియు ఎనిమిదవ తరగతిలో ఒక క్రమబద్ధమైన పరీక్ష ఉండవలెను. కొన్ని సందర్భములలో పరీక్ష మరియు ఆపి ఉంచుట.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనబడిన పరీక్షలో ఒక బాలుడు లేదా బాలిక ఉత్తీర్ణత పొందనియెడల అతనికి లేదా ఆమెకు అదనపు శిక్షణ ఈయబడవలెను మరియు ఫలితాలు వెల్లడించిన తేదీ నుండి రెండు మాసముల కాలావధిలోపల తిరిగి పరీక్ష వ్రాయుటకు అవకాశమును మంజూరు చేయవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దేశించబడిన తిరిగి నిర్వహించబడిన పరీక్షలో అతను ఉత్తీర్ణత పొందనియెడల, విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి షరతులకు అధ్యధీనమై ఐదవ తరగతిలో లేదా ఎనిమిదవ తరగతిలో లేదా రెండు తరగతులలోను, ఆ బాలుని లేదా బాలికను ఆపి ఉంచడానికి సముచిత ప్రభుత్వము పాఠశాలలను అనుమతించవచ్చును:

అయితే, ఒక బాలుడు లేదా బాలిక ప్రాథమిక విద్య పూర్తి అయ్యేంతవరకు ఏ తరగతిలోను ఆపి ఉంచరాదని సముచిత ప్రభుత్వము నిర్ణయించవలెను.

(4) ప్రాథమిక విద్య పూర్తి అయ్యేంతవరకు ఏ బాలుడు లేక బాలిక పాఠశాల నుండి బహిష్కరించబడరాదు.

బాలుని శారీరక దండన మరియు మానసిక వేధింపులపై నిషేధము.

17. (1) ఏ బాలునిగాని శారీరక దండనకు లేక మానసిక వేధింపులకు గురిచేయరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలను ఉల్లంఘించిన వారెవరైనను అట్టి వ్యక్తికి వర్తించు సేవా నియమముల క్రింద క్రమశిక్షణా చర్యకు పాత్రుడగును.

గుర్తింపు ధృవ పత్రము పొందకుండా ఏ పాఠశాల స్థాపించబడరాదు.

18. (1) సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారముచే స్థాపించబడి, స్వామ్యము లేక నియంత్రణ కలిగిన పాఠశాల కానట్టి ఇతర పాఠశాల, ఈ చట్టము అమలులోనికి వచ్చిన తరువాత విహితపరచబడునట్టి ప్రరూపము మరియు రీతిలో దరఖాస్తు చేయుట ద్వారా అట్టి ప్రాధికారము నుండి గుర్తింపు ధృవపత్రమును పొందకుండా స్థాపించబడరాదు లేక కృత్యములు నిర్వర్తించరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద విహితపరచబడిన ప్రాధికారము, విహితపరచబడునట్టి ప్రరూపము, అట్టి కాలావధిలోపల, అట్టి రీతిలో మరియు అట్టి షరతులకు అధ్యధీనమై గుర్తింపు ధ్రువపత్రమును జారీచేయవలెను:

అయితే, 19వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచబడిన సూత్రములు మరియు ప్రమాణములను అది పాటించిననే తప్ప ఏ పాఠశాలకు అట్టి గుర్తింపును మంజూరుచేయరాదు.

(3) గుర్తింపు యొక్క షరతుల ఉల్లంఘనపై, విహితపరచబడిన ప్రాధికారము, వ్రాతపూర్వకమైన ఉత్తరువు ద్వారా, గుర్తింపును ఉపసంహరించవలెను:

అయితే, అట్టి ఉత్తర్వు, గుర్తింపు తొలగించబడిన పాఠశాలలోని బాలలను దగ్గరగా ఉన్న ఏ పాఠశాలలో చేర్పించవలెనో అను దానిపై ఒక ఆదేశమును కలిగియుండవలెను:

అంతేకాక, అట్టి పాఠశాలకు విహితపరచబడునట్టి రీతిలో ఆకర్ణించుకొనుటకు అవకాశము నివ్వకుండ గుర్తింపును ఉపసంహరించరాదు.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద గుర్తింపును ఉపసంహరించబడిన తేదీ నుండి అట్టి పాఠశాల కృత్యములను కొనసాగించరాదు.

(5) గుర్తింపు ధ్రువ పత్రమును పొందకుండా పాఠశాలను స్థాపించిన లేక నడుపుచున్న లేదా గుర్తింపును ఉపసంహరించబడిన తరువాత పాఠశాలను నడుపుటను కొనసాగించుచున్న ఎవరేని వ్యక్తి, ఒకలక్ష రూపాయల వరకు విస్తరించగల జరిమానాకు మరియు కొనసాగుచున్న ఉల్లంఘనల విషయంలో, అట్టి ఉల్లంఘనలు కొనసాగుచున్నంతవరకు ప్రతి దినమునకు పదివేల రూపాయల జరిమానాకు పాత్రుడగును.

19. (1) అనుసూచిలో నిర్దిష్టపరచబడిన సూత్రములు మరియు ప్రమాణములను పాటించిననే తప్ప, 18వ పరిచ్ఛేదము క్రింద పాఠశాలను స్థాపించరాదు లేక గుర్తించరాదు. పాఠశాలకు సూత్రములు మరియు ప్రమాణములు.

(2) ఈ చట్టపు ప్రారంభమునకు పూర్వము స్థాపించబడిన పాఠశాల అనుసూచిలో నిర్దిష్టపరచబడిన సూత్రములను మరియు ప్రమాణములను పాటించని యెడల, అట్టి ప్రారంభపు తేదీనుండి మూడు సంవత్సరముల కాలావధి లోపుగా తన స్వంత ఖర్చులతో అట్టి సూత్రములను మరియు ప్రమాణములను పాటించుటకు చర్యలు తీసుకొనవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచిన కాలావధి లోపుగా పాఠశాల సూత్రములను మరియు ప్రమాణములను పాటించుటలో విఫలమైన యెడల, 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద విహితపరచబడిన ప్రాధికార సంస్థ, దానిలోని ఉప-పరిచ్ఛేదము (3) క్రింద నిర్దిష్టపరచిన రీతిలో అట్టి పాఠశాలకు మంజూరు చేసిన గుర్తింపును ఉపసంహరించవలెను.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద గుర్తింపును ఉపసంహరించిన తేదీ నుండి పాఠశాల కృత్యములను కొనసాగించరాదు.

(5) గుర్తింపు ఉపసంహరించబడిన తరువాత పాఠశాల కృత్యములను కొనసాగించుచున్న ఎవరేని వ్యక్తి, ఒక లక్ష రూపాయల వరకు విస్తరించగల జరిమానాకు మరియు కొనసాగుచున్న ఉల్లంఘనల విషయంలో, అట్టి ఉల్లంఘన కొనసాగుచున్నంతవరకు ప్రతి దినమునకు పదివేల రూపాయల జరిమానాకు పాత్రుడగును.

20. కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఏవేని సూత్రములు మరియు ప్రమాణములను చేర్చుట లేక దానిని వదిలివేయుట ద్వారా అనుసూచిని సవరించవచ్చును. అనుసూచిని సవరించుటకు అధికారము.

పాఠశాల యాజమాన్య కమిటీ.

21. (1) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్) యొక్క ఉప ఖండము (iv)లో నిర్దిష్టపరచిన పాఠశాలకానట్టి ఇతర పాఠశాల, స్థానిక ప్రాధికారము, అట్టి పాఠశాలలో చేర్చుకొనబడిన బాలల తల్లితండ్రులు లేక సంరక్షకులు మరియు అధ్యాపకుల నుండి ఎన్నుకొనబడిన ప్రతినిధులతో కూడిన పాఠశాల యాజమాన్య కమిటీని సంఘటితము చేయవలెను:

అయితే, అట్టి కమిటీలో కనీసము నాలుగింట మూడవ వంతు మంది సభ్యులు తల్లిదండ్రులు లేక సంరక్షకులు అయివుండవలెను:

అంతేకాక, అననుకూల వర్గము మరియు బలహీన వర్గమునకు చెందిన బాలల యొక్క తల్లిదండ్రులకు లేక సంరక్షకులకు అనుపాతిక ప్రాతినిధ్యమును ఇవ్వవలెను:

అంతేకాక ఇంకనూ, అట్టి కమిటీలో యాబది శాతము మంది సభ్యులు మహిళలై ఉండవలెను.

(2) పాఠశాల యాజమాన్య కమిటీ, ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) పాఠశాల పనితీరును పర్యవేక్షించవలెను;

(బి) పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి సిఫారసు చేయవలెను;

(సి) సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారము లేక ఏదేని ఇతర వనరు నుండి స్వీకరించిన అనుదానముల యొక్క వినియోగమును పర్యవేక్షించవలెను; మరియు

(డి) విహితపరచబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించవలెను.

[1][అయితే,

(ఎ) మత లేక భాషా ప్రాతిపదికపై అల్పసంఖ్యాక వర్గముచే స్థాపించబడి మరియు నడుపబడుచున్న పాఠశాల; మరియు

(బి) 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్)లోని ఉప-ఖండము (ii)లో నిర్వచించబడిన ఎయిడెడ్ పాఠశాలలన్నింటి,

విషయములో ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఏర్పాటు చేయబడిన పాఠశాల యాజమాన్య కమిటీ, సలహాపూర్వకమైన కృత్యమును మాత్రమే నిర్వర్తించవలెను.]

---

1. 2012లోని 30వ చట్టపు 5వ పరిచ్ఛేదము ద్వారా (1-8-2012 నుండి) చొప్పించబడినది.

22. (1) 21వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద [1][మత లేక భాషా ప్రాతిపదికపై అల్పసంఖ్యాక వర్గముచే స్థాపించబడి/నడుపబడుచున్న పాఠశాల మరియు 2వ పరిచ్ఛేదపు ఖండము (ఎన్)లోని ఉప-ఖండము (ii)లో నిర్వచించబడిన ఎయిడెడ్ పాఠశాలకు సంబంధించి స్థాపించబడిన పాఠశాల యాజమాన్య కమిటీ తప్ప,] పాఠశాల యాజమాన్య కమిటీ, విహితపరచబడునట్టి రీతిలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేయవలెను.

పాఠశాల అభివృద్ధి ప్రణాళిక.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అట్లు తయారుచేయబడిన పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సముచిత ప్రభుత్వము లేక సందర్భానుసారము స్థానిక ప్రాధికారముచే చేయబడు ప్రణాళికలు మరియు అనుదానములకు ప్రాతిపదికగా ఉండవలెను.

23. (1) కేంద్ర ప్రభుత్వముచే అధిసూచన ద్వారా ప్రాధికార మొసగబడి, విద్యా సంబంధ ప్రాధికారముచే పొందుపరచబడినట్టి కనీస అర్హతలు కలిగినట్టి ఎవరేని వ్యక్తి అధ్యాపకునిగా నియమింపబడుటకు అర్హుడగును.

అధ్యాపకుల నియామక మునకైన అర్హతలు, సేవా నిబంధనలు మరియు షరతులు.

(2) అధ్యాపక విద్యలో కోర్సులను లేక శిక్షణను ఇచ్చుటకు రాజ్యంలో సరిపోయినన్ని సంస్థలు లేనపుడు లేక ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పొందుపరచబడిన కనీస అర్హతలను కలిగియున్న అధ్యాపకులు తగినంత సంఖ్యలో లభ్యముకానపుడు, కేంద్ర ప్రభుత్వము, తాను అవసరమని భావించినచో, అధిసూచన ద్వారా, అయిదు సంవత్సరములకు మించనట్టి కాలావధికి అధిసూచనలో నిర్దిష్టపరచుచూ, అధ్యాపకునిగా నియమించుటకు అవసరమైన కనీస అర్హతలను సడలించవచ్చును:

అయితే, ఈ చట్ట ప్రారంభమున ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పొందుపరచబడిన కనీస అర్హతలు లేనటువంటి అధ్యాపకుడు అయిదు సంవత్సరముల కాలావధి లోపుగా అట్టి కనీస అర్హతలను పొందవలెను.

[2][అంతేకాక ఇంకనూ, నియమించబడిన లేదా ఉపపరిచ్ఛేదము (1) క్రింద నిబంధించబడినట్టి కనీస అర్హతను కలిగివుండని 2015 మార్చి 31వ తేదీన పదవిలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు బాలల ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు (సవరణ) చట్టము, 2017 (2017లోని 24వది) యొక్క ప్రారంభ తేదీ నుండి నాలుగు సంవత్సరముల కాలావధి లోపల అట్టి కనీస అర్హతను పొందవలసి ఉంటుంది.]

(3) అధ్యాపకులకు చెల్లించవలసిన జీతభత్యములు మరియు సేవా నిబంధనలు మరియు షరతులు విహితపరచబడునట్లుండవలెను.

అధ్యాపకుల కర్తవ్యములు మరియు వ్యథల నివారణ.

24. (1) 23వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియమించబడిన అధ్యాపకుడు ఈ క్రింది కర్తవ్యములను నిర్వహించవలెను, అవేవనగా:-

(ఎ) పాఠశాలకు హాజరగుటలో క్రమబద్ధత మరియు సమయపాలనను పాటించవలెను;

(బి) 29వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క నింబంధనల ననుసరించి పాఠ్యప్రణాళికను నిర్వహించి మరియు పూర్తి [illegible]లెను;

(సి) నిర్ధిష్టపరచిన స[illegible]లోగా పూర్తి పాఠ్యప్రణాళికను పూర్తిచేయవలెను;

(డి) ప్రతి బాలుని విద్యాసముపార్జన సామర్ధ్యమును నిర్ధారణ చేయవలెను మరియు తదనుసారముగా అవసరమైన ఏవేని అనుపూరక అదనపు అనుదేశములు సూచించవలెను;

(ఇ) తల్లిదండ్రులు మరియు సంరక్షకులతో క్రమబద్ధముగా సమావేశములను నిర్వహించవలెను మరియు విద్యా సముపార్జనా సామర్ధ్యం, విద్యా సముపార్జనంలోని పురోభివృద్ధి, హాజరు క్రమబద్ధత మరియు బాలునికి సంబంధించిన ఏదేని ఇతర సమాచారమును గురించి వారి దృష్టికి తీసుకొనిరావలెను.

(ఎఫ్) విహితపరచబడునట్టి ఇతర కర్తవ్యములను నిర్వహించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్ధిష్టపరచిన కర్తవ్యములను నిర్వహించుటలో ఉపేక్షణ చూపిన అధ్యాపకుడు, అతనికి లేక ఆమెకు వర్తించు సేవా నియమముల క్రింద క్రమశిక్షణా చర్యకు పాత్రుడగును:

అయితే, అట్టి క్రమశిక్షణా చర్య తీసుకొనుటకు ముందు, అట్టి అధ్యాపకునికి ఆకర్ణింపబడుటకు తగిన అవకాశమునీయవలెను.

(3) అధ్యాపకునికి ఏవేని వ్యథలు ఉన్నయెడల వాటిని విహితపరచబడు రీతిలో నివారణ చేయవలెను.

25. (1) ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి [1][మూడు సంవత్సరముల లోపుగా,] సముచిత ప్రభుత్వము మరియు స్థానిక ప్రాధికారము అనుసూచిలో నిర్దిష్టపరచిన విధముగా పాఠశాలలోని విద్యార్థి-అధ్యాపకుని నిష్పత్తిని పాటించునట్లు చూడవలెను. విద్యార్థి-అధ్యాపకుని నిష్పత్తి.

(2) ఉప-పరిచ్ఛేదము (1)క్రింద విద్యార్థి అధ్యాపకుని నిష్పత్తి పాటించుట కొరకు, ఒక పాఠశాలలో పదస్థాపన చేయబడిన అధ్యాపకుడిని ఏదేని ఇతర పాఠశాలలో లేక కార్యాలయములో లేక 27వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచినవి కానట్టి ఏదేని విద్యాయేతర ప్రయోజనమునకు అభినియోజనము చేయరాదు.

26. సముచిత ప్రభుత్వము లేక స్థానిక ప్రాధికారముచే స్థాపించబడి, స్వామ్యము లేక నియంత్రణ కలిగియున్న లేదా ప్రత్యక్షంగా లేక పరోక్షంగా దాని నుండి తగినంత నిధులను ఆర్థిక సహాయముగా పొందుచున్న పాఠశాలకు సంబంధించి, నియామకపు ప్రాధికారి, తన నియంత్రణ క్రిందనున్న పాఠశాలలోని అధ్యాపకుల ఖాళీలు మంజూరు చేయబడిన మొత్తము అధ్యాపకుల సంఖ్యలో పదిశాతమునకు మించనట్లుగా చూడవలెను. అధ్యాపకుల ఖాళీలన భర్తీచేయుట.

27. దశవార్షిక జనగణన, విపత్తు సహాయక కర్తవ్యములు లేదా స్థానిక ప్రాధికారము లేక రాజ్య శాసనమండలుల లేక సందర్భానుసారము పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన కర్తవ్యములు కానట్టి ఏవేని ఇతర విద్యాయేతర ప్రయోజనముల కొరకు ఏ అధ్యాపకుడిని అభినియోగించబడరాదు. అధ్యాపకులను విద్యాయేతర ప్రయోజనములకు అభినియోగించుటపై నిషేధము.

28. ప్రైవేటు ట్యూషను లేక ప్రైవేటుగా బోధన కార్యక్రమములో ఏ అధ్యాపకుడు అతను లేక ఆమె స్వయంగా నిమగ్నము కారాదు. అధ్యాపకుని ప్రైవేటు ట్యూషనుపై నిషేధము.

## అధ్యాయము - V

## పాఠ్యప్రణాళిక మరియు ప్రాథమిక విద్యను పూర్తిచేయుట.

29. (1) ప్రాథమిక విద్యకైన పాఠ్యప్రణాళిక మరియు ప్రగతి నిర్ధారణ ప్రక్రియ సముచిత ప్రభుత్వముచే అధిసూచన ద్వారా నిర్దిష్టపరచబడు విద్యా విషయక ప్రాధికారముచే పొందుపరచబడవలెను. పాఠ్యప్రణాళిక మరియు ప్రగతి నిర్ధారణ ప్రక్రియ.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పాఠ్యప్రణాళిక మరియు ప్రగతి నిర్ధారణ ప్రక్రియను పొందుపరచునపుడు, విద్యావిషయక ప్రాధికారము, ఈ క్రింది విషయములను పరిగణనలోనికి తీసుకొనవలెను, అవేవనగా:-

(ఎ) సంవిధానములో ప్రస్తావించబడిన విలువలకు అనుగుణముగా;

(బి) అన్ని విధములా బాలుని అభివృద్ధి;

(సి) బాలుని పరిజ్ఞానమును, స్తోమతను మరియు ప్రతిభను పెంపొందించుట;

(డి) శారీరక మరియు మానసిక సామర్ధ్యముల పూర్తి అభివృద్ధి;

(ఇ) పిల్లల స్నేహం మరియు పిల్లల మధ్య పద్ధతిలో క్రియాశీలత, ఆవిష్కరణ, అన్వేషణ ద్వారా నేర్పించుట;

(ఎఫ్) సాధ్యమైనంత వరకు విద్యా బోధన బాలుని మాతృభాషలో ఉండుట;

(జి) బాలుని భయము, గాయము మరియు మనస్తాపము నుండి దూరము చేయుట మరియు బాలుడు స్వేచ్ఛగా తన అభిప్రాయమును తెలుపుటకు సహాయపడుట;

(హెచ్) సమగ్రమైన మరియు నిరంతర ప్రగతి నిర్ధారణలో బాలుని పరిజ్ఞానం యొక్క అవగాహనా శక్తి మరియు దానిని వర్తింపజేయుటలో అతని లేక ఆమె సామర్ధ్యము;

పరీక్ష మరియు పూర్తి చేసినట్లుగా ధృవపత్రము.

30. (1) ప్రాథమిక విద్య పూర్తియగునంతవరకు బాలుడు ఏదేని మండలి యొక్క పరీక్షను ఉత్తీర్ణుడు కావలసిన అవసరము లేదు.

(2) ప్రాథమిక విద్య పూర్తిచేసిన ప్రతి బాలునికి విహితపరచబడునట్టి ప్రరూపము మరియు అట్టి రీతిలో ధృవపత్రమును ప్రదానము చేయవలెను.

## అధ్యాయము - VI

## బాలల హక్కుల రక్షణ

బాలల విద్యా హక్కు పర్యవేక్షణ. 2006లోని 4వ చట్టము.

31. (1) బాలల హక్కుల రక్షణకైన కమీషనుల చట్టము, 2005 యొక్క 3వ పరిచ్ఛేదము క్రింద స్థాపించబడిన బాలల హక్కుల రక్షణకైన జాతీయ కమీషను, లేక సందర్భానుసారముగా 17వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేయబడిన బాలల హక్కుల రక్షణకైన రాజ్య కమీషను, ఈ చట్టము క్రింద వాటికి అప్పగించబడిన కృత్యములకు అదనముగా ఈ క్రింది కృత్యములను కూడ నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) ఈ చట్టముచే లేక దాని క్రింద కల్పించబడిన హక్కుల రక్షణల పరిశీలన మరియు పునర్విలోకన మరియు వాటిని సమర్థవంతముగా అమలుపరచుట కొరకైన చర్యలను సిఫారసు చేయుట;

(బి) ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కుకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలనచేయుట; మరియు

(సి) బాలల హక్కుల రక్షణకైన కమీషనుల చట్టము యొక్క 15వ మరియు 24వ పరిచ్ఛేదముల క్రింద నిబంధించబడినట్లుగా అవసరమైన చర్యలు తీసుకొనుట.

(2) సదరు కమీషనులు, ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (సి) క్రింద ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కుకు సంబంధించిన ఏవేని విషయములలో పరిశీలన జరుపునపుడు, బాలల హక్కుల రక్షణకైన కమీషనుల చట్టము యొక్క 15వ మరియు 24వ పరిచ్ఛేదముల క్రింద వరుసగా వాటికి అప్పగించబడిన అధికారములనే కలిగియుండును.

(3) బాలల హక్కుల రక్షణ కొరకైన రాజ్య కమీషనును రాజ్యములో సంఘటితము చేయబడనియెడల, సముచిత ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (ఎ) నుండి (సి)లలో నిర్దిష్టపరచబడిన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము విహితపరచబడునట్టి రీతిలో మరియు అట్టి నిబంధనలు మరియు షరతులకు అధ్యధీనమైన అట్టి ప్రాధికారమును సంఘటితము చేయువచ్చును.

32. (1) 31 వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ, ఈ చట్టము క్రింద బాలుని యొక్క హక్కునకు సంబంధించి ఏదేని వ్యథకు గురియైన ఎవరేని వ్యక్తి, అధికారితాపరిధిని కలిగియున్న స్థానిక ప్రాధికారికి వ్రాతపూర్వకమైన ఫిర్యాదును చేయవచ్చును. వ్యథల విచారణ.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఫిర్యాదు అందిన మీదట, స్థానిక ప్రాధికారము సంబంధిత పక్షకారులకు ఆకర్ణింపబడుటకు తగిన అవకాశమునిచ్చిన తరువాత మూడు మాసముల కాలావధిలోపల విషయమును నిర్ణయించవలెను.

(3) స్థానిక ప్రాధికారము యొక్క నిర్ణయముపై వ్యథితుడైన ఎవరేని వ్యక్తి, బాలల హక్కుల రక్షణ కొరకైన రాజ్య కమీషనుకు లేక సందర్భానుసారము 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద విహితపరచబడిన ప్రాధికారము అపీలు చేసుకొనవచ్చును.

(4) ఉప-పరిచ్ఛేదము (3) క్రింద చేయబడిన అపీలు, బాలల హక్కుల రక్షణ కొరకైన రాజ్య కమీషను లేక సందర్భానుసారము 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (సి) క్రింద విహితపరచబడిన ప్రాధికారముచే నిర్ణయించబడవలెను.

జాతీయ సలహా మండలి సంఘటితము చేయుట.

33. (1) కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ప్రాథమిక విద్య మరియు బాలల అభివృద్ధి రంగములో పరిజ్ఞానము మరియు వ్యావహారికానుభవము కలిగిన వ్యక్తుల నుండి పదిహేను మందికి మించకుండా కేంద్ర ప్రభుత్వము తాను అవసరమని భావించునంతమంది సభ్యులతో కూడినట్టి ఒక జాతీయ సలహా మండలిని సంఘటితము చేయవలెను.

(2) ఈ చట్టము యొక్క నిబంధనలను సమర్థవంతముగా అమలుపరచుటలో కేంద్ర ప్రభుత్వమునకు సలహానిచ్చుట జాతీయ సలహామండలి కృత్యములై ఉండును.

(3) జాతీయ సలహా మండలి సభ్యుల భత్యములు మరియు ఇతర నియామక నిబంధనలు మరియు షరతులు విహితపరచబడునట్లుండవలెను.

రాజ్య సలహామండలి సంఘటితము చేయుట.

34. (1) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ప్రాథమిక విద్య మరియు బాలల అభివృద్ధి రంగములో పరిజ్ఞానము మరియు వ్యావహారికానుభవము కలిగిన వ్యక్తుల నుండి పదిహేను మందికి మించకుండా, రాజ్య ప్రభుత్వము తాను అవసరమని భావించునంతమంది సభ్యులతో కూడినట్టి ఒక రాజ్య సలహా మండలిని సంఘటితము చేయవలెను.

(2) ఈ చట్టము యొక్క నిబంధనలను సమర్థవంతముగా అమలుపరచుటలో రాజ్య ప్రభుత్వమునకు సలహానిచ్చుట రాజ్య సలహామండలి కృత్యములై ఉండును.

(3) రాజ్య సలహామండలి సభ్యుల భత్యములు మరియు ఇతర నియామక నిబంధనలు మరియు షరతులు విహితపరచబడునట్లుండవలెను.

## అధ్యాయము - VII

## వివిధములు.

ఆదేశములను ఇచ్చుటకు అధికారము.

35. (1) కేంద్ర ప్రభుత్వము, సముచిత ప్రభుత్వము లేక సందర్భానుసారము స్థానిక ప్రాధికారమునకు ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచు నిమిత్తము తాను సబబని భావించునట్టి మార్గదర్శకములను జారీచేయవచ్చును.

(2) సముచిత ప్రభుత్వము, స్థానిక ప్రాధికారమునకు లేక పాఠశాల యాజమాన్య కమిటీకి, ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచుట గురించి తాను సబబని భావించునట్టి మార్గదర్శకములను జారీచేయవచ్చును మరియు అట్టి ఆదేశములను జారీచేయవచ్చును.

(3) స్థానిక ప్రాధికారము, పాఠశాల యాజమాన్య కమిటీకి ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచుట గురించి తాను సబబని భావించునట్టి మార్గదర్శకములను జారీచేయవచ్చును మరియు అట్టి ఆదేశములను జారీచేయవచ్చును.

అభియోగమునకు పూర్వానుమతి.

36. సముచిత ప్రభుత్వముచే అధిసూచన ద్వారా, ఈ విషయములో ప్రాధికార మొసగబడిన అధికారి యొక్క పూర్వానుమతితో తప్ప, 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2), 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5) మరియు 19వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5)ల క్రింద శిక్షింపదగు అపరాధములపై ఎటువంటి అభియోగము మోపరాదు.

సద్భావముతో తీసుకున్న చర్యకు రక్షణ.

37. ఈ చట్టము లేక దాని క్రింద చేయబడిన ఏవేని నియమములు లేక ఉత్తరువు ననుసరించి చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనికైనను కేంద్రప్రభుత్వము, రాజ్య ప్రభుత్వము, బాలల హక్కుల రక్షణకైన జాతీయ కమీషను, బాలల హక్కుల పరిరక్షణకైన రాజ్య కమీషను, స్థానిక ప్రాధికారము, పాఠశాల యాజమాన్య కమిటీ లేక ఎవరేని వ్యక్తిపై ఎట్టి దావా లేక ఇతర శాసనిక చర్య ఉండదు.

నియమములు చేయుటకు సముచిత ప్రభుత్వమునకు అధికారము.

38. (1) కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా ఈ చట్టపు నిబంధనలను అమలుపరచు నిమిత్తము నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకించి మరియు పైన పేర్కొనబడిన అధికారముల యొక్క సాధారణ వ్యాపకతకు భంగము కలుగకుండా, అట్టి నియమములను ఈ క్రింది అన్ని లేక వాటిలో ఏ విషయముల కొరకైనను చేయవచ్చును, అవేవనగా,-

(ఎ) 4వ పరిచ్ఛేదపు ఒకటవ నిబంధన క్రింద ప్రత్యేక శిక్షణను ఇచ్చు రీతి మరియు కాలపరిమితి;

(బి) 6వ పరిచ్ఛేదము క్రింద దగ్గరలో ఉండు ప్రాంతము లేక పరిధులలో పాఠశాలను స్థాపించుట;

(సి) 9వ పరిచ్ఛేదపు ఖండము (డి) క్రింద పదునాలుగు సంవత్సరముల వయస్సు వరకు బాలల రికార్డుల నిర్వహణా రీతి;

(డి) 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద తిరిగి రాబట్టుకొను వ్యయము యొక్క రీతి మరియు విస్తరణ;

(ఇ) 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద బాలుని వయస్సు నిర్ధారణకైన ఏదేని ఇతర దస్తావేజు;

(ఎఫ్) 15వ పరిచ్ఛేదము క్రింద, ప్రవేశము కొరకు పొడిగింపబడిన కాలావధి మరియు పొడిగింపబడిన కాలావధిలో చేర్చుకొనబడినచో అధ్యయనమును పూర్తిచేయు రీతి;

[1](ఎఫ్ఎ)16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ఒక బాలుడు లేదా బాలికను ఆపి ఉంచబడుటకు రీతి మరియు అందుకు అధ్యధీనమైన షరతులు;

(జి) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద, గుర్తింపు ధ్రువపత్రము కొరకు దరఖాస్తు చేయవలసిన ప్రాధికారము, ప్రరూపము మరియు రీతి;

(హెచ్) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద, గుర్తింపు ధ్రువపత్రము జారీచేయుటకైన ప్రరూపము, కాలావధి, రీతి మరియు షరతులు;

(ఐ) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) యొక్క రెండవ వినాయింపు క్రింద ఆకర్షింపబడుటకు అవకాశమునిచ్చుటకైన రీతి;

(జె) 21వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (డి) క్రింద పాఠశాల యాజమాన్య కమిటీచే నిర్వర్తించబడు ఏవేని ఇతర కృత్యములు;

(కె) 22వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారుచేయు రీతి;

(ఎల్) 23 పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద అధ్యాపకునికి చెల్లించదగు జీతభత్యములు మరియు సేవా నిబంధనలు మరియు షరతులు;

(ఎమ్) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎఫ్) క్రింద అధ్యాపకునిచే నిర్వర్తించబడవలసిన కృత్యములు;

---

1. 2019లోని 1వ చట్టము, 2వ పరిచ్ఛేదము ద్వారా (1-3-2019 నుండి) చొప్పించబడినది.

(ఎన్) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద అధ్యాపకుల యొక్క వ్యథల నివారణ రీతి;

(ఒ) 30వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రాథమిక విద్య పూర్తిచేసిన మీదట ప్రదానము చేయు ధృవపత్రపు ప్రరూపము మరియు రీతి;

(పి) 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద ప్రాధికారమును సంఘటితపరచు రీతి మరియు దాని నిబంధనలు, షరతులు;

(క్యూ) 33వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద జాతీయ సలహా మండలి సభ్యుల భత్యములు మరియు వారి నియామకమునకైన ఇతర నిబంధనలు మరియు షరతులు;

(ఆర్) 34వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద రాజ్య సలహా మండలి సభ్యుల భత్యములు మరియు నియామకమునకైన ఇతర నిబంధనలు మరియు షరతులు;

(3) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును మరియు 20 మరియు 23వ పరిచ్ఛేదముల క్రింద కేంద్ర ప్రభుత్వముచే జారీచేయబడిన ప్రతి అధిసూచనను, అది చేయబడిన తరువాత వీలైనంత త్వరలో, పార్లమెంటు అధివేశనములోనున్నచో, దాని ఉభయ సదనముల సమక్షమందున, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశనములోగాని, రెండు లేక అంతకంటే ఎక్కువ అనుక్రమ అధివేశనములలోగాని చేరియుండవచ్చును మరియు ఆ అధివేశనము లేక అనుక్రమ అధివేశనములకు అవ్యవహితానంతరము వచ్చు అధివేశనము ముగియుటకు ముందు, ఆ నియమము లేక అధిసూచనలో ఏదేని మార్పుచేయుటకు ఉభయ సదనములు అంగీకరించినట్లయితే, లేక నియమము లేక అధిసూచనను చేయడానికి ఉభయ సదనములు అంగీకరించనట్లయితే, అటు తర్వాత ఆ నియమము లేక అధిసూచన అట్లు మార్పు చేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును, లేక సందర్భానుసారము ప్రభావరహితమైయుండును. అయితే, ఏదేని అట్టి మార్పు లేక రద్దు, ఆ నియమము లేక అధిసూచన క్రింద అంతకుపూర్వము చేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

(4) ఈ చట్టము క్రింద రాజ్య ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమము లేక అధిసూచనను, అది చేయబడిన తరువాత వీలైనంత త్వరలో రాజ్య శాసనమండలుల సమక్షమున ఉంచవలెను.

[1][ఇబ్బందులను తొలగించుటకు కేంద్ర ప్రభుత్వమునకు అధికారము.

39. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుచేయుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినచో కేంద్ర ప్రభుత్వము, రాజపత్రములో ప్రచురించిన ఉత్తర్వు ద్వారా, ఇబ్బందిని తొలగించుటకు అవసరమని లేక ఉపయుక్తమని తమకు తోచునట్టి, ఈ చట్టపు నిబంధనలకు అసంగతము కానట్టి నిబంధనలు చేయవచ్చును:

అయితే, ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ఏ ఉత్తర్వుగాని ఉచిత మరియు నిర్బంధ విద్య కొరకైన బాలల హక్కు (సవరణ) చట్టము, 2012 యొక్క ప్రారంభపు తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధి ముగిసిన తరువాత చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి ఉత్తర్వును, దానిని చేసిన వెంటనే పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ఉంచవలెను.]

---

1. 2012లోని 30వ చట్టపు 8వ పరిచ్ఛేదము ద్వారా (1-8-2012 నుండి) చొప్పించబడినది.

# అనుసూచి

## (19 మరియు 25వ పరిచ్ఛేదములను చూడుడు)

## పాఠశాల కొరకైన సూత్రములు మరియు ప్రమాణములు.

| క్రమ సంఖ్య | అంశము | సూత్రములు మరియు ప్రమాణములు. | |
|---|---|---|---|
| 1. | అధ్యాపకుల సంఖ్య: | | |
| | (ఎ) ఒకటవ తరగతి నుండి అయిదవ తరగతులకు | చేర్చుకొనబడిన బాలలు | అధ్యాపకుల సంఖ్య |
| | | అరవైమంది వరకు | ఇద్దరు |
| | | అరవై ఒకటి నుండి తొంబై మధ్య | ముగ్గురు |
| | | తొంబై ఒకటి నుండి నూట ఇరవై మధ్య | నలుగురు. |
| | | నూట ఇరవై ఒకటి నుండి రెండు వందలకు మధ్య | అయిదుగురు. |
| | | నూట యాభై మందికి మించిన బాలలు | అయిదుగురితో కూడిన ఒక ప్రధాన అధ్యాపకుడు |
| | | రెండు వందలకు మించిన బాలలు | విద్యార్థి - అధ్యాపకుని నిష్పత్తి (ప్రధాన అధ్యాపకుని మినహాయించి) నలభైకి మించరాదు. |
| | (బి) ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతులకు | (1) ఈ క్రింది వాటికి కనీసము ఒక అధ్యాపకుడు ఉండునట్లుగా తరగతికి కనీసము ఒక అధ్యాపకుడు-<br>(i) సామాన్య శాస్త్రము మరియు గణిత శాస్త్రము;<br>(ii) సాంఘిక శాస్త్రము;<br>(iii) భాషలు.<br>(2) ప్రతి ముప్పై అయిదుమంది బాలలకు కనీసము ఒక అధ్యాపకుడు<br>(3) ఒక వందకు మించి బాలలను చేర్చుకొన్నప్పుడు-<br>(i) పూర్తికాలపు ప్రధాన అధ్యాపకుడు;<br>(ii) ఈ క్రింది వాటి కొరకు అంశకాలిక బోధకులు-<br>(ఏ) కళల విద్య;<br>(బీ) ఆరోగ్య మరియు శారీరక విద్య;<br>(సీ) పని విద్య. | |

| | | |
|---|---|---|
| 2. | భవనము | ఈ క్రింది వాటితో కూడియున్న అన్ని వాతావరణములకైన భవనము-<br>(i) ప్రతి అధ్యాపకునికి కనీసము ఒక తరగతి గది మరియు కార్యాలయము - స్టోరు - సహిత ప్రధాన అధ్యాపకుని గది;<br>(ii) అవరోధము లేని ప్రవేశము;<br>(iii) మగ పిల్లలకు మరియు ఆడపిల్లలకు విడి విడిగా మరుగుదొడ్లు;<br>(iv) బాలలందరికి సురక్షితమైన మరియు సరిపడినంతగా త్రాగునీటి సదుపాయము;<br>(v) పాఠశాలలో మధ్యాహ్న భోజనము వండుటకై ఒక వంట శాల;<br>(vi) ఆట స్థలము;<br>(vii) పరిహద్దు గోడ లేక ఫెన్సింగుతో పాఠశాల భవనమును రక్షించుటకైన ఏర్పాట్లు. |
| 3. | విద్యా సంవత్సరములో పనిదినముల/బోధనా గంటల కనీస సంఖ్య. | (i) ఒకటవ తరగతి నుండి అయిదవ తరగతి వరకు రెండు వందల పనిదినములు;<br>(ii) ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు రెండువందల ఇరవై పనిదినములు;<br>(iii) ఒకటవ తరగతి నుండి అయిదవ తరగతి వరకు విద్యా సంవత్సరమునకు ఎనిమిది వందల బోధనా గంటలు;<br>(iv) ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు విద్యా సంవత్సరమునకు వేయి బోధనా గంటలు. |
| 4. | ఒక అధ్యాపకునికి వారమునకు కనీస గంటల సంఖ్య. | సన్నాహక గంటలతో సహా నలభై అయిదు బోధనా గంటలు. |
| 5. | బోధనా విద్యా సముపార్జనా సామగ్రి. | ప్రతి తరగతికి అవసరమైనంతగా ఏర్పాటు చేయవలెను. |
| 6. | గ్రంథాలయము. | ప్రతి పాఠశాలలో వార్తా పత్రికలు, మ్యాగజైనులు మరియు కథల పుస్తకములతో సహా అన్ని విషయములపైన పుస్తకములను అందించు ఒక గ్రంథాలయము ఉండవలెను. |
| 7. | ఆట వస్తువులు, క్రీడలు, మరియు క్రీడా సామగ్రి. | ప్రతి తరగతికి అవసరమైనంతగా అందజేయవలెను. |

జి. నారాయణ రాజు,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.

Printed by the Commissioner of Printing, at A.P. Legislative Assembly Printing Press, Amaravati.